నమస్తే తెలంగాణ

నిజామాబాద్


5 | నిజామాబాద్, శనివారం 28 సెప్టెంబర్ 2024 | NIZAMABAD



రుణమాఫీ ఎందుకు కాలేదని ఇందల్వాయి సొసైటీ చైర్మన్, సీఈవోపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

## మాఫీ మాకెందుకు రాలే..?

సంపూర్ణ రుణమాఫీ కాకపోవడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మాఫీ మాకెందుకు రాలేదని అధికారులను నిలదీస్తున్నారు. అలాగే, పంటలకు మద్దతు ధరతో పాటు బోనస్ చెల్లించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇందుకు ప్రాథమిక సహకార సంఘాల మహా జన సభలను వేదిక చేసుకుంటున్నారు. తాజాగా ఇందల్వాయి, నవీపేట్ మండలం నాగేపూర్, రెంజల్ మండలం దూపల్లితో పాటు మోర్తాడ్ సొసైటీలలో నిర్వహించిన మహా జన సభల్లో రైతులు రుణమాఫీ, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, సన్నాలతో పాటు దొడ్డు వడ్లకు సైతం బోనస్ చెల్లించాలని పట్టుబట్టారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు షరతుల్లేకుండా రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.



నిజామాబాద్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న మేయర్ నీతూకిరణ్, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

## కొండా లక్ష్మణ్‌కు నివాళి

తెలంగాణ వాది, స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు ఉమ్మడి జిల్లాలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

**మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి**

ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 27 : తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లాకేంద్రానికి శుక్రవారం వచ్చిన ఆయన రైల్వేకమాన్ వద్ద ఉన్న బాబూ జగ్జీవన్ రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాల వారీగా వర్గీకరణ ప్రక్రియ చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బరికుంట శ్రీనివాస్, నాయకులు విజయ్, ప్రశాంత్, గంగాధర్, శంకర్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిడమర్తి రవి

- కొనుగోలు కేంద్రాల జాడే లేదు
- సగం మందికి కూడా రుణ మాఫీ కాలే..
- సర్కారుపై మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి ధ్వజం





సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేముల

# 'మద్దతు'తో పాటు బోనస్ కూడా ఇవ్వాలి

వేల్పూర్, సెప్టెంబర్ 27: ఎన్నికలప్పుడు అన్ని రకాల వడ్లకు బోనస్ ఇచ్చి కొంటామన్న కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడేమో సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం రైతులను మోసం చేయడమేనని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. మక్క, సోయా, వరి పంటలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు అదనంగా రూ.500 బోనస్ ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వమే ఆయా పంటలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ విషయంలోనూ మోసగించారని, ఉమ్మడి జిల్లాలో సగం మంది రైతుల రుణాలను కూడా మాఫీ చేయలేదని, రైతు భరోసా కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. వేల్పూర్‌లోని తన నివాసంలో శుక్రవారం వేముల విలేకరులతో మాట్లాడారు. కేంద్రం నిర్ణయించిన ధరకు అదనంగా రూ.500 బోనస్ ఇస్తామని వరంగల్ రైతు డిక్లరేషన్‌లో, ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పారని, చెప్పినట్లే బోనస్ చెల్లించి రైతుల పంటలను కొనుగోలు చేయాలన్నారు. ఉమ్మడి జిల్లాలో ఎక్కువగా మక్కజొన్న సాగు చేశారని, పంట కోతలు కూడా ప్రారంభమయ్యాయన్నారు. కానీ ఇప్పటికీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని విమర్శించారు. దీంతో దళారులు తక్కువ ధరకే కొంటుండడంతో రైతులు ఎకరాకు రూ.60 వేల దాకా నష్టపోతున్నారన్నారు. మక్కకు కేంద్రం నిర్ణయించిన మద్దతు ధర రూ.2,225లకు తోడు కాంగ్రెస్ ఇస్తామన్న రూ.500 బోనస్ చెల్లించి రాష్ట్ర ప్రభుత్వమే పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, సోయా పంట మద్దతు ధర రూ.4,892 కాగా, దళారులు రూ.4,300 మాత్రమే చెల్లిస్తున్నారని చెప్పారు. ప్రైవేట్ వ్యాపారులు సోయా కొనడం ద్వారా రైతులు రూ.500 బోనస్‌తో కలిపి క్వింటాల్‌కు రూ.1100 నష్టపోతున్నారన్నారు.

**సంపూర్ణ రుణమాఫీ చేయాల్సిందే..**

వడ్లకు బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ ఇప్పుడు సన్నవడ్లకే ఇస్తామని మాట మార్చిందని దుయ్యబట్టారు. రుణమాఫీ విషయంలోనూ అలాగే చేసిందన్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 3,79 లక్షల రైతులకు రుణమాఫీ కావాల్సి ఉండగా, 1.75 లక్షల మందికి మాత్రమే రైతులకు మాఫీ అయ్యిందన్నారు. ఇంకా 2.04 లక్షల రైతులకు రుణ మాఫీ జరగలేదన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో 48 వేల మందికి గాను 32 వేల మంది రైతులకు రుణమాఫీ కాలేదని వివరించారు. సంపూర్ణ మాఫీ చేసే వరకూ వదిలేది లేదని స్పష్టం చేశారు.

**వ్యాధుల నియంత్రణేది?**

కేసీఆర్ ప్రభుత్వం ఇంటింటి హెల్త్ ప్రొఫైల్ తయారుచేసి, సీజనల్, ఇతర వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకుందని వేముల గుర్తు చేశారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్‌కు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నదని, దీంతో సీజనల్ వ్యాధులు విజృంభించాయన్నారు. ఆశ వర్కర్లు, ఏఎన్ఎంల సేవలను కూడా సరిగా వాడుకోలేక పోతోందన్నారు. వెంటనే హెల్త్ క్యాంప్‌లు ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. ప్రభుత్వ దవాఖానల్లో సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు, చికెన్ గున్యా లాంటి వాటికి మందులు అందుబాటులో ఉంచాలన్నారు. పార్టీ నేతలు ఎలియా, భూమేశ్, గంగాధర్, నర్సారెడ్డి, రాజేశ్వర్, గంగారెడ్డి పాల్గొన్నారు.



**వర్షాలకు తెగిపోయిన రోడ్డు పరిశీలన**

వేల్పూర్, సెప్టెంబర్ 27: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రామన్నపేట్, వేల్పూర్ గ్రామాల మధ్య తెగిపోయిన రోడ్డును శుక్రవారం మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పరిశీలించారు. రోడ్డు విస్తరణ కోసం నిధులు మంజూరైనందున వాటి నుంచి ఇక్కడ కల్వర్టు నిర్మాణం చేపట్టేలా చూడాలని అధికారులను ఎమ్మెల్యే కోరారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

## ఇందూరులో పాయల్ జిగేల్

**ఇందూరులో** సినీ తారలు శుక్రవారం సందడి చేశారు. నగరంలో కొలువుదీరిన సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవ వేడుకలో హీరో రామ్, హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ అభిమానులను అలరించారు. హైదరాబాద్‌లోని పూలాంగ్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన షాపింగ్ మాల్‌ను ఎంపీ అర్వింద్ ప్రారంభించారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, మేయర్ నీతూకిరణ్, సీఎంఆర్ షాపింగ్ మాల్ చైర్మన్ మాపూరి వెంకటరమణ, మేనేజింగ్ డైరెక్టర్ మాపూరి మోహన్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

– ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 27



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎంపీ అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

అభిమానులనుద్దేశించి మాట్లాడుతున్న హీరో రామ్

## లింగంపేటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం..

**కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్**

లింగంపేట, సెప్టెంబర్ 27: లింగంపేట మండలాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని కామారెడ్డి కలెక్టర్ అశీష్ సంగ్వాన్ అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని నాగన్న బావి వద్ద నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల భాగస్వామ్యంతో నాగన్న బావిని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. పూర్వవైభవం సంతరించుకున్న నాగన్న బావి.. లింగంపేటకు వన్నె తీసుకువచ్చిందన్నారు. నాగన్న బావితోపాటు రామాలయం, నగరేశ్వర ఆలయాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఇక్కడికి వచ్చే పర్యాటకుల సంఖ్య పెరిగిందని, ఆహార పదార్థాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. నాగన్న బావి అభివృద్ధి చేసే బాధ్యతలను స్వయం సహాయక సంఘాల వారికి అప్పగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. అంతకుముందు స్వయం సహాయక సంఘ మహిళలు ఏర్పాటు చేసిన ఫుడ్‌స్టాల్‌ను కలెక్టర్ సందర్శించారు.



సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్ సభ్యులు ఏర్పాటు చేసిన ఫుడ్‌స్టాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

## అధికారుల తీరుపై నిరసన

నగరంలోని 40వ డివిజన్‌లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా కొనసాగడం లేదని, ఇందుకు అధికారుల తీరును నిరసిస్తూ డివిజన్‌కు చెందిన రాగి అనిల్ నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట శుక్రవారం బైఠాయించాడు. పారిశుద్ధ్య పనులపై జవాన్లను అడిగితే దురుసుగా మాట్లాడుతున్నారని, అధికారులు వచ్చే వరకూ ఇక్కడి నుంచి కదిలేదని భీష్మించుకు కూర్చున్నాడు. గంటతర్వాత కార్పొరేషన్ అధికారులు వచ్చి, సదరు వ్యక్తికి నచ్చజెప్పడంతో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కేవలం ఒక్క 40వ విడిజన్‌లోనే కాకుండా ప్రతి డివిజన్‌లోనూ ఇలాంటి పరిస్థితి ఉందంటూ మున్సిపల్‌కు వచ్చిన వారంతా వ్యాఖ్యానించడం గమనార్హం.

–కంఠేశ్వర్, సెప్టెంబర్ 27



## తాగునీటి కోసం ధర్నా..

**ఎక్లాస్‌పూర్ క్యాంపులో ఖాళీ బిందెలతో ఆందోళన**



ఖాళీ బిందెలతో రోడ్డుపై ధర్నా చేస్తున్న మహిళలు

కోటగిరి, సెప్టెంబర్ 27: తాగునీటి కోసం మహిళలు రోడ్డెక్కారు. నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కోటగిరి మండలంలోని ఎక్లాస్‌పూర్ క్యాపులోని ఎస్సీ కాలనీవాసులు శుక్రవారం ఉదయం ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి, ధర్నా నిర్వహించారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నా పట్టించుకునేవారే కరువయ్యారంటూ ఆవేదన వ్యక్తంచేశారు. కాలనీలోని బోరుమోటరు కాలిపోయిందని సంబంధిత శాఖ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. నీళ్ల కోసం వ్యవసాయ బోరుబావుల వద్దకు పరుగులు పెట్టాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



బీర్కూర్ తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న లబ్ధిదారులు

## పట్టాలు ఇవ్వాలని ఆందోళన

**తహసీల్ ఆఫీస్ ఎదుట 'డబుల్ ఇండ్ల' లబ్ధిదారుల ధర్నా**

నస్రుల్లాబాద్, సెప్టెంబర్ 27: డబుల్ బెడ్ రూం ఇండ్ల లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. తమకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీర్కూర్ తహసీల్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఏడేండ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వం బీర్కూర్ మండలం బైరాపూర్ గ్రామంలో 157 డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించింది. అధికారులు అర్హులను ఎంపిక చేసి ఇండ్లను పంపిణీ చేయగా.. లబ్ధిదారులు సంతోషంగా గృహప్రవేశాలు చేసుకున్నారు. అయితే ఇండ్లకు సంబంధించిన పట్టాల కోసం 157 మంది లబ్ధిదారులు బీర్కూర్ తహసీల్ కార్యాలయానికి తరలివచ్చారు. వెంటనే పట్టాలని ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ లతకు వినతిపత్రాన్ని అందజేశారు.

## మరమ్మతులు పూర్తి చేయాలి

కామారెడ్డి, సెప్టెంబర్ 27 : ఇటీవల కురిసిన వర్షాలతో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతు పనులను అక్టోబర్ 7లోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. మినీ సమావేశ మందిరంలో ఇంజినీరింగ్, వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సమీక్షించారు. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, కాలువలు తదితర మరమ్మతు పనులకు సంబంధించిన ప్రతిపాదనల మేరకు పనులు పూర్తి చేయాలని, నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ స్థానిక కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొన్నారు. వివిధ పాఠశాలల విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఫేర్‌ను తిలకించారు. ఆర్డీవో రంగనాథ్ రావు, డీఈవో రాజు, జిల్లా యువజన అధికారి జగన్నాథ్ పాల్గొన్నారు.

**అత్యవసర మరమ్మతులకు ప్రతిపాదనలు**

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో అవసరమైన అత్యవసర మరమ్మతులు ఉంటే సంబంధిత ఇంజినీరింగ్ విభాగం అధికారులు ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ అధికారులు, పంచాయతీరాజ్, ఈడబ్ల్యూడీసీ సంబంధిత ప్రిన్సిపాల్, వసతి గృహాలు, సంక్షేమ అధికారులు, కేజీబీవీ ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. తాగునీరు సమస్య ఉంటే వెంటనే పరిష్కరించే దిశగా ప్రతిపాదించాలని సూచించారు. వసతి గృహాలు, పాఠశాలల్లో సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత సీనియర్ అధికారికి వివరించాలన్నారు. పనుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు.



సైన్స్‌ఫేర్‌లో విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్

## న్యూసెన్స్ చేసిన ఇద్దరికి జైలుశిక్ష

వినాయక్‌నగర్, సెప్టెంబర్ 27 : నగరంలోని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం మత్తులో రోడ్డుపై న్యూసెన్స్ చేసిన ఇద్దరు యువకులకు కోర్టు రెండు రోజుల చొప్పున జైలు శిక్ష విధించింది. ఎస్సై మహేశ్ తెపిన వివరాల ప్రకారం.. దుబ్బకు చెందిన రాచకొండ శ్రీకాంత్, కంఠేశ్వర్‌కు చెందిన డెకకా రవికుమార్ గురువారం రాత్రి మద్యం తాగి, కంఠేశ్వర్ గుడి వద్ద న్యూసెన్స్ చేశారు. వారిపై ఎస్సై కేసు నమోదు చేసి, శుక్రవారం సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చారు. ఇద్దరికి రెండు రోజుల చొప్పున జైలుశిక్ష విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చినట్లు తెలిపారు.